www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | బుధవారం,సెప్టెంబర్16.2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:197 | పేజీలు: 8 | వెల: రూ.5/-

## టీడీపీ ఎమ్మెల్యే మారువేషం..

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సామాన్యుడిలా మారువేషంలో వెళ్లి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. కార్యాలయ సిబ్బంది పనితీరును, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకే ఆయన ఈ తనిఖీ చేపట్టారు.ఎమ్మెల్యే బాలరాజు మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో గళ్ల లుంగీ, టీ-షర్ట్ ధరించి, ముఖానికి మాస్క్ పెట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు గంటపాటు అక్కడే ఉండి, కార్యాలయ కార్యకలాపాలను, సిబ్బంది ప్రవర్తనను నిశితంగా గమనించారు. మారువేషంలో ఉండటంతో అక్కడ ఉన్నవారెవరూ ఆయన్ను గుర్తుపట్టలేకపోయారు.వెంటనే స్పందించిన బాలరాజు తన అసలు గుర్తింపును వెల్లడించి, కార్యాలయ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

- 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తాం
- ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తాం

## అసెంబ్లీలో 22ఏ పై చర్చ.. రెవెన్యూ శాఖపై సీఎం సమీక్ష



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని యంఆర్సీహెచ్‌ఆర్డీ లో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. 22ఏపై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22ఏ పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా 22ఏ జాబితాపై సీఎం రేవంత్‌కు రెవెన్యూ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్ష సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, వివేక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో 22ఏ, ఎల్ నినోపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి వారు చర్చించారు.

**లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: డిప్యూటీ సీఎం**

నవంబర్19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఆయన సమీక్షించారు. రూ. లక్ష లోపు స్వయం ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలలపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు.




### రేవంత్ పాలనతో తెలంగాణ

# రౌడీ రాజ్యంలా మారింది

- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్‌ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోం మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### దేశం నుంచి ఆశించడమే కాదు..

# సేవ చేయండి

- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ,సామాన్యుడి అస్త్రం**

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు."యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి.
దేశహితాని కే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్న ప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది.మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక

- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది.ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది.

## కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు.

### కొండా సురేఖ బర్తరఫ్

# బాధాకరమే

- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.
హైదరాబాద్‌లో మంగళవారం మీ డియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

## అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

- నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై కేసు
- నానక్‌రామ్‌గూడ భూ వివాదంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు
- గేట్ల తాళాలు పగలగొట్టి చొరబడ్డారని ఆరోపణ
- సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులకు సాక్ష్యంగా అందజేత
- ఉద్యోగులు, నివాసితులకు రక్షణ కల్పించాలని వినతి

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**


ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది.నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు.

## అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు

- కక్ష్యలో అమెరికా వద్ద ఆయుధాలు ఉన్నట్లు స్పేస్ ఫోర్స్ ప్రకటన
- వీటిని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్'గా పేర్కొన్న అమెరికా

**ఇంటర్నెట్ న్యూస్,సెప్టెంబర్15**

అంతరిక్షంలో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్' కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివ రాలను మాత్రం వెల్లడించలేదు.



## ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం

- ఎర్రవల్లి కేసులో నిందితుల అరెస్టుపై హైకోర్టు బ్రేక్
- నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది.ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది.

# లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

మొదటి పేజీ తరువాయి

**సభ ముందుకు ధరణి మాటున భూ రికార్డుల మార్పుల చిట్టా?**
**ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం ఇచ్చేలా వ్యూహం**
**నిషేధిత భూముల జాబితాపై అధికారుల ప్రజెంటేషన్**
**బాధితులకు ఊరట కల్పించడంపై ప్రభుత్వ కసరత్తు**
**మంత్రులతో వ్యూహంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**

### ధరణి హయాంలో ఏం జరిగింది?

22ఏ సమస్యను కేవలం ప్రస్తుత సమస్యగా కాకుండా గతంలో భూ రికార్డుల నిర్వహణలో చోటుచేసుకున్న పరిణామాలతో ముడిపెట్టి వివరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డుల్లో జరిగిన మార్పులు, భూ లావాదేవీల్లో చోటుచేసుకున్న అవకతవకలు, వాటి వల్ల రైతులు, సామాన్యులు ఎదుర్కొన్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకురావాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. ఎవరి హయాంలో భూముల కేటాయింపులు జరిగాయి? ఏ ప్రాతిపదికన భూములను 22ఏ జాబితాలో చేర్చారు? రికార్డుల్లో ఎలాంటి మార్పులు జరిగాయి? వాటి వల్ల ఎవరెవరు నష్టపోయారు? అనే అంశాలను ఆధారాలతో సహా సభలో ప్రస్తావించే అవకాశం ఉంది.

### నిజమైన యజమానులకు ఊరట

22ఏ జాబితాలో భూములు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిజమైన భూ యజమానులు, కొనుగోలుదారులకు ఊరట కల్పించే అంశంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పొరపాటున నిషేధిత జాబితాలో చేరిన భూములను గుర్తించి అర్హులకు న్యాయం చేసే మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ, వివాదాస్పద, నిషేధిత భూములను పరిరక్షిస్తూనే నిజమైన బాధితులకు చట్టపరమైన సమస్యలు లేకుండా పరిష్కారం చూపే విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ పేరుతో సామాన్యులు నష్టపోకుండా అవసరమైన వెసులుబాటు కల్పించే అంశంపైనా సీఎం మంత్రులతో చర్చించినట్లు సమాచారం.

### ఎల్‌నినోపైనా చర్చ

బుధవారం అసెంబ్లీలో 22ఏ అంశంతోపాటు ఎల్‌నినోపై కూడా చర్చ జరగనుంది. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు లేవనెత్తే ఆరోపణలకు సమాధానం ఇవ్వడంతోపాటు, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను ప్రజలకు వివరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది. సీఎస్ సంజయ్ జాజు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారింది

మొదటి పేజీ తరువాయి

### న్యాయస్థానాల్లో తేల్చుకుంటాం..

తెలంగాణలో పోలీస్ శాఖ అధికార పార్టీ తొత్తుగా మారి, కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఠాణాలోనే దాడులు చేస్తున్న దుండగులకు పోలీసులు వత్తాసు పలుకుతూ రక్షణగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థను నమ్ముకుంటే న్యాయం జరగదని ప్రజలకు, తమకు పూర్తిగా అర్థమైందని, అందుకే న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నామని స్పష్టం చేశారు. కోర్టుల్లో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉందని పేర్కొన్నారు. తాము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక నిరాశ, నిస్పృహలతోనే రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తూ 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే భౌతిక దాడులకు దిగుతోందని, ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ భయపడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ప్రజా క్షేత్రంలోనే ఈ అరాచక సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తేల్చిచెప్పారు.

### న్యాయ విచారణ జరపాలి..

22 ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. 30 శాతం కమిషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనకు ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. 22 ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందనుకుంటే రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని విమర్శించారు. తప్పు చేసింది అధికారులు కాదు.. ప్రభుత్వమే అని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన నివాసాలను నిషేధిత జాబితా నుంచి బేషరతుగా తొలగించి, బాధితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదలాయింపు అసాధ్యంగా ఉండేదని, నేడు యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపించారు. 'ఇది భూభారతి కాదు.. భూ హారతి' అని వ్యాఖ్యానించారు. రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, తప్పు చేసిన వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే బీఆర్ఎస్ సభ్యులను శాసనసభ, మండలి నుంచి సస్పెండ్ చేసిందని విమర్శించారు. అయినా తాము ప్రజల్లోనే ఉంటామన్నారు. ప్రజల సంక్షేమం కోసం పోరాడుతామన్నారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే..

మొదటి పేజీ తరువాయి

**సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య**
**ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి**
**పార్టీ సమస్యలను అంతర్గత వేదికల్లోనే చర్చించాలని సూచన**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. "పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో



ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..

మొదటి పేజీ తరువాయి

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం**
**త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక**

ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.



# దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

మొదటి పేజీ తరువాయి

**ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య**
**తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి**

"యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్–ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు



చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

# అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..

మొదటి పేజీ తరువాయి

**ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులపై పోలీసులను నిలదీసిన కోర్టు**
**సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టీకరణ**
**అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు**

ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

# కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

మొదటి పేజీ తరువాయి

**ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ**
**630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ**
**పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ**

తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు

మొదటి పేజీ తరువాయి

**ఆయుధాల సంఖ్య, స్థానం, రకాలను వెల్లడించని అగ్రరాజ్యం**
**రక్షణతో పాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని వెల్లడి**
**చైనా, రష్యాలను ప్రధాన అంతరిక్ష ముప్పులుగా గుర్తిస్తున్న అమెరికా**

అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్–కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతో పాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొంది. అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతరిక్ష రంగంలో చైనా, రష్యాల నుంచి ముప్పు పెరుగుతోందని అమెరికా భావిస్తోంది. ఉపగ్రహాలు సైనిక కమ్యూనికేషన్లు, నిఘా, నావిగేషన్‌కు కీలకం కావడంతో వాటిపై ఆధిపత్యం భవిష్యత్ యుద్ధాల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా తొలిసారి కక్ష్యలో ఆయుధాల ఉనికిని బహిరంగంగా అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# విఘ్నాలు తొలగాలి.. పౌరసేవలు పరుగులు తీయాలి!





- సీఎంసీ ప్రధాన కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో గణేష్ పూజ
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కమిషనర్, ఉన్నతాధికారులు, సిబ్బంది
- సైబరాబాద్ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని ప్రార్థనలు
- అధికారులు, ఉద్యోగుల్లో ప్రతిబింబించిన ఐక్యత--సమష్టి బాధ్యత

**సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్:**

విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు అందించే పౌరసేవలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో గణేష్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అధికారులు, ఉద్యోగులు కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్‌తోపాటు వివిధ విభాగాల అధిపతులు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని శ్రీ గణేశుడికి పుష్పాలు సమర్పించారు. జ్ఞానం, శ్రేయస్సు, సౌభ్రాతృత్వం ప్రసాదించడంతోపాటు ప్రజలకు సేవలు అందించే క్రమంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించాలని ప్రార్థించారు. సైబరాబాద్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని అధికారులు ఆకాంక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పౌరసేవలు అందించేందుకు ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. గణేష్ పూజలో ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ ఒకే వేదికపై పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం సీఎంసీ అధికార యంత్రాంగంలో ఐక్యత, సామరస్యం, సమష్టి బాధ్యతాభావాన్ని ప్రతిబింబించింది.

# అయ్యప్ప సొసైటీలో విషాదం..23 ఏళ్ల యువ ఉద్యోగి మృతి!

- టెర్రస్ నుంచి దూకినట్లు ప్రాథమిక సమాచారం.. ఘటనకు దారితీసిన కారణాలపై పోలీసుల ఆరా
- శ్రీకాకుళం జిల్లాకు చెందిన కలమట యశ్వంత్‌గా గుర్తింపు
- ఉదయం అనారోగ్యంతో వైద్య పరీక్షల కోసం రక్త నమూనాలు
- మధ్యాహ్నం 3:08 గంటల సమయంలో ఘటన.. కారణాలపై కొనసాగుతున్న విచారణ

**సామాన్యుడి అస్త్రం / మాదాపూర్:**

అయ్యప్ప సొసైటీలో మంగళవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ కో--లివింగ్ భవనం టెర్రస్ నుంచి దూకినట్లు భావిస్తున్న 23 ఏళ్ల యువ ఉద్యోగి తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన కలమట రమేష్ కుమారుడు కలమట యశ్వంత్‌గా గుర్తించారు. పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, యశ్వంత్ ఈ నెల 2వ తేదీ నుంచి అయ్యప్ప సొసైటీలోని అవాస కో--లివింగ్ భవనంలోని గది నంబర్ 206లో నివసిస్తున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి డెలాయిట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం యశ్వంత్ అనారోగ్యంగా ఉన్నట్లు చెప్పడంతో వైరల్ జ్వరం ఉందా లేదా తెలుసుకునేందుకు వైద్య పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం మధ్యాహ్నం సుమారు 3:08 గంటల సమయంలో భవనం టెర్రస్ నుంచి దూకినట్లు ప్రాథమిక సమాచారం. ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతడు ప్రాణాలు కోల్పోయాడు. అయితే యశ్వంత్ ఈ నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన కారణాలేమిటన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఉదయం ఎదురైన అనారోగ్య సమస్యకు, ఆ తర్వాత జరిగిన ఘటనకు ఏదైనా సంబంధం ఉందా అనే విషయంపైనా అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఘటనకు ముందు ఎవరితోనైనా



మాట్లాడాడా, వ్యక్తిగతంగా లేదా ఉద్యోగపరంగా ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నాడా అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరమే ఘటన వెనుక వాస్తవాలు వెల్లడయ్యే అవకాశముందని పోలీసులు పేర్కొన్నారు. నిర్ధారణ కాని కారణాలను ప్రచారం చేయవద్దని, దర్యాప్తులో వెలుగుచూసే ఆధారాలనే పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ట్యాంక్‌బండ్‌కు పీఓపీ గణేశులు వద్దు!..
# పోలీసుల కఠిన హెచ్చరిక

- హైకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే.. నెక్లెస్ రోడ్ వైపు ప్రత్యేక నిమజ్జన ఏర్పాట్లు
- హుస్సేన్‌సాగర్‌లో పీఓపీ విగ్రహాల నిమజ్జనంపై హెచ్చరిక బోర్డులు
- అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు భారీ క్రేన్ల ఏర్పాటుకూ ఆంక్షలు
- నెక్లెస్ రోడ్ తీరంలో అదనపు ప్లాట్‌ఫామ్‌లు, క్రేన్లు సిద్ధం



**సామాన్యుడి అస్త్రం / సిటీబ్యూరో :**

వినాయక నిమజ్జనాల వేళ హుస్సేన్‌సాగర్ వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన గణేష్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌తోపాటు నగర పరిధిలోని ఇతర జలాశయాల్లో నిమజ్జనం చేయవద్దని నిర్వాహకులు, భక్తులకు సూచించారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్, హుస్సేన్‌సాగర్ పరిసరాలతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆదేశాలను ప్రస్తావిస్తూ అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు విగ్రహాల నిమజ్జనం చేపట్టవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆ ప్రాంతంలో భారీ క్రేన్లు ఏర్పాటు చేయకుండా చూడాలని కూడా న్యాయస్థానం గతంలో స్పష్టం చేసినట్లు అధికారులు గుర్తుచేస్తున్నారు. జల కాలుష్యాన్ని నియంత్రించడం, హుస్సేన్‌సాగర్‌ను పరిరక్షించడమే ఈ ఆంక్షల ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు. నిమజ్జనానికి తరలివచ్చే విగ్రహాలను అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు కాకుండా నెక్లెస్ రోడ్ తీరానికి మళ్లించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ అదనపు ప్లాట్‌ఫామ్‌లు, క్రేన్లు ఏర్పాటు చేసి కేంద్ర నిమజ్జన ఊరేగింపును క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. పోలీసు, పౌర పరిపాలన విభాగాల సిబ్బంది నిమజ్జన కేంద్రాల వద్ద నిరంతరం పర్యవేక్షణ నిర్వహించనున్నారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసులు ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలు, నిమజ్జన మార్గదర్శకాలను ముందుగానే తెలుసుకుని వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. చివరి సమయంలో నిబంధనల పేరుతో వివాదాలకు దిగకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. 2021లో ప్రత్యేక పరిస్థితుల్లో పీఓపీ విగ్రహాల నిమజ్జనానికి సుప్రీంకోర్టు ఒక్కసారి మాత్రమే మినహాయింపు ఇచ్చింది. అనంతరం 2023లో తెలంగాణ హైకోర్టు మరోసారి పీఓపీ విగ్రహాల నిమజ్జనంపై ఆంక్షలను స్పష్టం చేసింది. దీంతో ఈసారి నిబంధనల అమలుపై పోలీసులు, పౌర సంస్థలు మరింత కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నాయి.

# ప్రయాణికుల వేషంలో మృత్యువు.. క్యాబ్ కోసం డ్రైవర్‌ను హత్య చేసిన ముఠా!





- బేగంపేట డ్రైవర్ హత్య కేసు ఛేదింపు.. మహారాష్ట్రకు చెందిన నలుగురు అదుపులో
- ప్రయాణికులుగా నటించి రాజశేఖర్ క్యాబ్‌ను బుక్ చేసిన ముఠా
- పటాన్‌చెరు దాటిన తర్వాత డ్రైవర్‌పై దాడి చేసి హత్య చేసినట్లు ఆరోపణ
- రుద్రారంలో మృతదేహం.. బుధేరా సమీపంలో క్యాబ్ గుర్తింపు

**సామాన్యుడి అస్త్రం / బేగంపేట/ పటాన్ చెరు :**

ప్రయాణికులుగా క్యాబ్ బుక్ చేశారు.. నమ్మకంగా గమ్యస్థానానికి తీసుకెళ్తున్న డ్రైవర్‌పైనే దాడి చేశారు.. చివరకు అతడిని హత్య చేసి కారుతో పరారయ్యారు. బేగంపేటకు చెందిన క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. క్యాబ్‌ను దోచుకునేందుకే మహారాష్ట్రకు చెందిన నలుగురు సభ్యుల ముఠా ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం బేగంపేటకు చెందిన రాజశేఖర్ (35) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగులకు రవాణా సేవలు అందించేవాడు. ప్రయాణికులుగా నటించిన నలుగురు అతడి క్యాబ్‌ను బుక్ చేసుకున్నారు. వారిని తీసుకుని బయలుదేరిన రాజశేఖర్ ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు సెప్టెంబర్ 10న బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడి కదలికలను గుర్తించే పనిలో ఉండగానే సెప్టెంబర్ 12న పటాన్‌చెరు పరిధిలోని రుద్రారం వద్ద రోడ్డు పక్కన రాజశేఖర్ మృతదేహం లభించింది. దీంతో అదృశ్యం కేసు కాస్తా హత్య కేసుగా మారింది. పోలీసుల దర్యాప్తులో క్యాబ్ పటాన్‌చెరు దాటిన తర్వాత ముఠా సభ్యులు రాజశేఖర్‌ను డ్రైవింగ్ సీటు నుంచి తప్పించి వాహనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తేలింది. అనంతరం అతడిపై దాడి చేసి, తీగతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని రుద్రారం సమీపంలో రోడ్డు పక్కన పడేసి క్యాబ్‌తో పరారైనట్లు పేర్కొంటున్నారు. రాజశేఖర్ మృతదేహం లభించిన ప్రాంతానికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో సంగారెడ్డి జిల్లా బుధేరా వద్ద జాతీయ రహదారి--65 సమీపంలో క్యాబ్‌ను పోలీసులు గుర్తించారు. వాహనంలో బీరు సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు లభించడంతో వాటి ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లారు. రాజశేఖర్‌తో పరిచయం ఉన్న పలువురు క్యాబ్ డ్రైవర్లను కూడా ప్రశ్నించి అతడి చివరి కదలికలను సేకరించారు. చివరకు ఈ హత్య వెనుక క్యాబ్‌ను దోచుకోవాలన్న పక్కా పథకం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి గత నేరచరిత్రపై ఆరా తీస్తున్నారు. ఈ ముఠా గతంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడిందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# 219 రోజుల ఆలస్యం.. లోతుకుంట భూముల ఎస్‌ఎల్‌పీకి సుప్రీంకోర్టు బ్రేక్!



- సాంకేతిక కారణాలతో పిటిషన్ తిరస్కరణ.. తదుపరి చర్యలపై హైడ్రా సమాలోచనలు
- సాధారణ అప్పీల్ గడువు ముగిసిన 219 రోజుల తర్వాత ఎస్‌ఎల్‌పీ దాఖలు
- కేసులోని భూ హక్కుల మెరిట్స్‌పై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వలేదని స్పష్టత
- ప్రభుత్వం, భాగస్వాములు, న్యాయ నిపుణులతో చర్చిస్తామన్న హైడ్రా కమిషనర్

**సామాన్యుడి అస్త్రం / సిటీబ్యూరో :**

లోతుకుంట భూముల వివాదానికి సంబంధించిన స్పెషల్ లీవ్ పిటిషన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నిర్ణీత గడువు దాటిన తర్వాత పిటిషన్ దాఖలు కావడంతో సర్వోన్నత న్యాయస్థానం దానిని సాంకేతిక కారణాలతో తిరస్కరించినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. సాధారణంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన 90 రోజుల గడువు ముగిసిన తర్వాత మరో 219 రోజుల ఆలస్యంతో ఎస్‌ఎల్‌పీ దాఖలైనట్లు సమాచారం. ఈ కారణంగానే పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ వద్ద దాఖలైన అప్పీల్‌లోనూ ఆలస్యం అంశం ప్రస్తావనకు వచ్చినట్లు వెల్లడించారు. అయితే సుప్రీంకోర్టు ఉత్తర్వులను భూ వివాదంపై తుది తీర్పుగా భావించడం సరికాదని న్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. పిటిషన్ గడువు దాటి దాఖలైందనే సాంకేతిక కారణంతోనే తిరస్కరణ జరిగిందని, వివాదంలోని భూ యాజమాన్యం, హక్కులు, ఇతర ప్రధాన అంశాలపై న్యాయస్థానం విచారణ జరిపి నిర్ణయం వెల్లడించలేదని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత భాగస్వాములు, న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. లోతుకుంట ప్రాంతంలో సమగ్ర సర్వే నిర్వహిస్తే భూములకు సంబంధించిన వాస్తవాలు బయటపడతాయని హైడ్రా మొదటి నుంచి చెబుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అందరి దృష్టి ప్రభుత్వం, హైడ్రా తదుపరి నిర్ణయంపై పడింది. సమగ్ర సర్వే నిర్వహిస్తారా, న్యాయపరంగా మరో అవకాశం పరిశీలిస్తారా, లేక సంబంధిత శాఖల రికార్డులను మరోసారి పరిశీలిస్తారా అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అప్పటి వరకు ఈ భూ వివాదంపై ఎవరి వాదన వారిదిగానే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన..



**ములుగు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ**
**అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**
**రాష్ట్రంలో కొనసాగుతున్న 19 శాతం వర్షపాత లోటు**
**హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాల అంచనా**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సెప్టెంబరు 19 నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు ప్రకటించింది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సెప్టెంబరు 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా 19, 20 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు.భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించి, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాల్సి వస్తే, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు.ఈ వర్షాలు రాష్ట్రంలో నెలకొన్న వర్షపాత లోటును కొంతమేర తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కంటే 19 శాతం వర్షపాత లోటు నమోదైంది. సెప్టెంబరు నెలలోనే ఇప్పటివరకు 28 శాతం లోటు ఉంది. ఇక హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని, పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# హయత్‌నగర్‌లో టిప్పర్ బీభత్సం..

- **ఆర్టీసీ బస్సును ఢీకొని 15 మందికి గాయాలు!**
- **కుంట్లూర్--రాజీవ్ గృహకల్ప రోడ్డుపై ప్రమాదం.. వేగమే కారణమా?**
- **నాగోల్ వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ**
- **ఎదురుగా వస్తున్న టీజీఎస్‌ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం**
- **క్షతగాత్రులు వనస్థలిపురం, సికింద్రాబాద్ ఆసుపత్రులకు తరలింపు**

**సామాన్యుడి అస్త్రం / హయత్‌నగర్:**

నగర శివారులో అతివేగం మరోసారి ప్రయాణికులను భయాందోళనకు గురిచేసింది. హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూర్--రాజీవ్ గృహకల్ప రోడ్డుపై మంగళవారం టిప్పర్ లారీ, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది గాయపడ్డారు.ప్రాథమిక సమాచారం ప్రకారం నాగోల్ వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది.స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను బస్సు నుంచి బయటకు తీసుకొచ్చారు. వైద్య సహాయక సిబ్బందితో కలిసి వారిని అంబులెన్సులు, అందుబాటులో ఉన్న వాహనాల్లో వనస్థలిపురం, సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. బాధితులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై భారీ వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు భద్రతా చర్యలు లేకపోవడం, వేగ నియంత్రణపై పర్యవేక్షణ కొరవడటం వల్ల ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదానికి టిప్పర్ అతివేగమే కారణమా, లేక మరో కారణం ఉందా అనే కోణంలో నాగోల్ పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాద సమయంలో రెండు వాహనాల వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, రహదారి పరిస్థితిపై వివరాలు సేకరిస్తున్నారు. దర్యాప్తు అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు సీఎం ఆహ్వానం

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్ హెరిటేజ్ కాపాడడంలో ఆగాఖాన్ ఫౌండేషన్ అండగా ఉందని, తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణ, మూసీ పునరుజ్జీవనం, విద్యా--పర్యాటక రంగాల అభివృద్ధిలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5ను సీఎం ఆహ్వానించారు. రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మంగళవారం ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీతో సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణతో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం.. దివంగత ఆగా ఖాన్-4 మృతి పట్ల సంతాపం తెలిపారు. తెలంగాణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. రాష్ట్ర వారసత్వ సంపద పునరుద్ధరణలో ఫౌండేషన్ చేస్తున్న కృషిని కొనియాడారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వ పరిరక్షణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తోందని సీఎం తెలిపారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించి ఇటీవల ప్రారంభించిన విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5కు వివరించారు. కుతుబ్‌షాహీ టూంబ్స్ పునరుద్ధరణలోనూ ఫౌండేషన్ అందించిన సహకారాన్ని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ఇద్దరూ కలసి పాల్గొన్న విషయాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్ చారిత్రక కట్టడాల పరిరక్షణకు మరింత ప్రాధాన్యమిస్తున్నామని, నగర అభివృద్ధితోపాటు వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు.మూసీ పునరుజ్జీవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంతో ఏర్పడిన మూసీ ఆక్రమణలు, కాలుష్యంతో దెబ్బతిన్నదని చెప్పారు. నదిని పునరుజ్జీవింపజేసి పరివాహక ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడంతోపాటు నైట్ ఎకానమీకి ఊతమిచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ప్రస్తుత ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకరించాలని సీఎం కోరారు. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న చారిత్రక భవనాన్ని హెరిటేజ్ కట్టడంగా పరిరక్షించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.



**ఫ్యూచర్ సిటీపై ఆగాఖాన్ ఆసక్తి**

భారత్ ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో సుమారు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని సీఎం వివరించారు. ఫ్యూచర్ సిటీకి సింగపూర్‌కు చెందిన సంస్థ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోందని తెలిపారు. నగరాన్ని నెట్-జీరో సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, దాదాపు 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని వెల్లడించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 2.5 శాతంగా ఉందని, దాన్ని 10 శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల ప్రతినిధులు సమ్మిట్‌లో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ కీలక సదస్సుకు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తప్పక హాజరు కావాలని సీఎం ఆహ్వానించారు.

**విద్య, పర్యాటక రంగంలో సహకరించాలి**

విద్యా రంగంలో ప్రపంచస్థాయి సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న భాగస్వామ్యాలను సమావేశంలో వివరించారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో చేసుకున్న ఒప్పందాలపై సీఎం సలహాదారు రామకృష్ణారావు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు మరికొన్ని ప్రపంచస్థాయి విద్యా సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అంగీకరించిన విషయాన్ని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఫ్యూచర్ సిటీని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను ఆమె వివరించారు. తెలంగాణ పర్యాటక రంగంలోనూ ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని విస్తరించాలని ప్రభుత్వం కోరింది. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ ప్రాంతాల పరిరక్షణతో పాటు వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడంలో ఫౌండేషన్ భాగస్వామ్యం కీలకమని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టుల్లో సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణాతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సీఎం బీసీయే!

**క్యాబినెట్‌లోనూ వారికే పెద్దపీట**
**ఉద్యమ నేతగా కేసీఆర్‌పై గౌరవం..**
**సీఎంగా ఆయన ఫెయిల్**
**వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా**
**మీడియా చిట్‌చాట్‌లో పీసీసీ అధ్యక్షుడు**
**మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**



'తెలంగాణ)లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావ డం ఖాయం. భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. క్యాబినెట్‌లో బీసీల ప్రాతినిథ్యం మరింత పెరగాలి. కనీసం నాలుగు నుంచి ఐదుగురికి మంత్రి పదవులు) దక్కాలి' అని టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డికి, నాకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదు. చిన్నచిన్న భిన్నాభిప్రాయాలు వచ్చినా వాటిని పరిష్కరించుకుంటూ జోడెద్దుల్లా సమన్వయంతో ముందుకు సాగుతున్నాం' అని పేర్కొన్నారుపీసీసీ అధ్యక్షుడి(గా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రెండేళ్ల పదవీకాలం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు.రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మా ఇద్దరి లక్ష్యమని, అందుకు రాష్ట్రం నుంచి 15 ఎంపీ సీట్లు గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను నిజామాబాద్ జిల్లాలో ఏదో ఒక నియోజక వర్గం నుంచి పోటీ చేస్తానని.. ఎక్కడ అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు.తనకు క్యాబినెట్‌లోకి పోవాలనే ఆలోచన లేదన్నారు. సీఎం రెడ్డి బిడ్డ అయినప్పటికీ.. కులగణన సర్వే పకడ్బందీగా చేయించాలరని పేర్కొన్నారు. బిహార్, కర్ణాటకలో కులగణ చేసినా, టేబుల్ చేయలేకపోయారని.. తెలంగాణ అసెంబ్లీలో చర్చకు పెట్టి కేంద్రానికి పంపించామని తెలిపారు. ఓబీసీని అని చెప్పుకునే ప్రధాని మోదీ.. బీసీ బిల్లును ఆమోదానికి ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.వచ్చే ఎన్నికల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల ప్రతిపాదన లేనిదే పేర్లు పరిశీలనలోకి రావన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ డీసీసీల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీసీసీల అధికారాలను పునరుద్ధరించామని, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ డీసీసీల వద్దే పేర్లు నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. డీసీసీ అధ్యక్షులకు ప్రొటోకాల్ కల్పించే అంశంపైన ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్‌ను ఉద్యమ నాయకుడిగా గౌరవిస్తామని, అయితే సీఎంగా ఆయన ఫెయిల్ అయ్యారని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆయన చేసిన తప్పులు, అప్పులను తాము భారం మోస్తున్నామన్నారు.గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించడం తన హయాంలో మైలురాయిగా నిలిచిందని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంత్రులే స్వయంగా గాంధీభవన్‌కు వచ్చి ప్రజా సమస్యలు వినడం గతంలో జరగలేదని, ప్రజల నుంచి వచ్చిన వినతులను తానే స్వయంగా నోట్ చేసుకుని పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళు న్నానని చెప్పారు.దార్శనికత కలిగిన నాయకుడైన రేవంత్‌రెడ్డి ఆధునిక సదుపాయాలతో ఫోర్త్ సిటీ'ని తీర్చిదిద్దుతుంటే బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా పేదలకు ద్రోహం చేసిందన్నారు. తమ పాలనలో సన్న బియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.హైడ్రా రాకతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి బాధ్యత కలిగినదని మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. తన రెండేళ్ల పదవీ కాలంలో పార్టీకి బలాన్ని, కార్యకర్తలకు ఆత్మస్థైర్యం ఇచ్చానని చెప్పారు. పార్టీ ఇన్‌చార్జ్‌లుగా వచ్చిన దీపాదాస్ మున్షీ, మీనాక్షినటరాజన్ ఇద్దరూ తనకు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. గాంధీభవన్ నుంచి మెసేజ్ ఇస్తే లక్షల మందికి వెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేశానని చెప్పారు.

**పూర్తి కార్యవర్గం వేయలేకపోయా..**

పీసీసీ పూర్తి కార్యవర్గం వేయలేక పోయాననే అసంతృప్తి ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం కూడా ఆలస్యమైంది. కార్పొరేషన్ చైర్మన్లను కూడా సకాలంలో నియమించలేకపోయాం. ఈ నెలాఖరుకి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తాం' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పరిపాలన, పథకాల అమలు, అభివృద్ధి విషయంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని, ఏఐసీసీ రేటింగ్ కూడా రేటింగ్ ఇచ్చిందన్నారు. సర్పంచ్ ఎన్నికలో ?ల బీసీలు 60 శాతం సీట్లు, మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతానికి పైగా సీట్లు ఇచ్చి గెలిపించుకున్నామని చెప్పారు. పార్టీని గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం చేయగలిగానని పేర్కొన్నారు.

## సింగరేణిలో దారుణం: వేధింపులు తాళలేక

# ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**సింగరేణిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య**
**ఓవర్‌మ్యాన్ లైంగిక వేధింపులే కారణమని సూసైడ్ నోట్‌లో ఆరోపణ**
**ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదని మనస్తాపం**
**ఓవర్‌మ్యాన్‌తో పాటు లెక్చరర్‌పైనా కేసు నమోదు, నిందితులు పరారీ**
**నిందితులను శిక్షించాలని దళిత సంఘాల ఆందోళన, మంత్రి హామీ**



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

లైంగిక వేధింపులు తాళలేక సింగరేణి సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని (21) ఆత్మహత్య చేసుకుంది. ఓవర్‌మ్యాన్ లైంగిక వేధింపులపై యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు, బాధితురాలి తండ్రి కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన యువతి ఈ ఏడాది ఫిబ్రవరిలో సింగరేణిలోని 2 ఇంక్లైన్ గనిలో ఇంటర్న్‌షిప్ ప్రారంభించింది. అక్కడ పనిచేస్తున్న ఓవర్‌మ్యాన్ బొమ్మకంటి రవికుమార్ ఆమెతో పరిచయం పెంచుకుని, ఆ తర్వాత లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయంపై ఆమె సింగరేణి యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా, వారు దానిని కొట్టిపారేశారు. దీంతో ఇంటర్న్‌షిప్ మానేసిన యువతి, స్థానికంగా ఓ కంప్యూటర్ సెంటర్‌లో చేరింది. అయినప్పటికీ రవికుమార్‌తో పాటు, ఆమె పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ నవీన్ కూడా వేధింపులు కొనసాగించారు. ఈ వేధింపులు భరించలేక సెప్టెంబర్ 13న ఆమె పురుగుల మందు తాగింది. లెక్చరర్ నవీన్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించి పరారయ్యాడు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె ప్రాణాలు కోల్పోయింది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు రవికుమార్, నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నట్లు సమాచారం.

**సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు**

ఘటనా స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్ ఈ కేసులో కీలకంగా మారింది. ఓవర్‌మ్యాన్ రవికుమార్ తనపై అత్యాచారం చేశాడని, యాజమాన్యం ఫిర్యాదును పట్టించుకోలేదని ఆమె అందులో పేర్కొంది. తన చావుతోనైనా నిందితుడికి కఠిన శిక్ష పడాలని కోరింది.

**దళిత సంఘాల ఆందోళన**

ఈ ఘటనపై దళిత సంఘాలు తీవ్రంగా స్పందించాయి. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సింగరేణి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన చేపట్టాయి. మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరాయి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు



**నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల**
**తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు**
**మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# పోలీసుల ఎదుట విచారణకు హాజరైన యూట్యూబర్ నందన

**గడువుకు ఒకరోజు ముందే పోలీసుల ఎదుట హాజరైన యూట్యూబర్ నందన**
**విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం చేశారనే ఆరోపణలు**
**ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన, గడువు కంటే ఒకరోజు ముందే మరోసారి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం అధికారులు ఆమెను విచారించారు. వాస్తవానికి, ఆమె సెప్టెంబర్ 16వ తేదీలోగా విచారణకు హాజరుకావాల్సి ఉండగా, ఒకరోజు ముందుగానే న్యాయవాదులతో కలిసి రావడం గమనార్హం.సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణలో పోలీసులు ఆమెకు 20 ప్రశ్నలు సంధించారు. కన్సల్టెన్సీ వ్యవహారాలన్నీ తన భర్త పర్యవేక్షించేవారని, ఆ లావాదేవీలతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తనపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఆమె ఈ సందర్భంగా పోలీసులను కోరారు. విచారణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆమె హామీ ఇవ్వగా, ఆ విన్నపాన్ని పరిశీలిస్తామని పోలీసులు వెల్లడించారు.విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే నెపంతో నందన, ఆమె భర్త పలువురిని మోసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆ దంపతులిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లగా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు వారిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు.ఇటీవల బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నందనను ఇమ్మిగ్రేషన్



అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా తనిఖీ చేసిన అధికారులు, ఆమెపై ఎల్ఓసీ ఉన్నట్లు గుర్తించి వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఆ సమయంలో ఆమెను ప్రాథమికంగా విచారించి, మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆమె నిర్దేశిత గడువు కంటే ముందే పోలీసుల విచారణకు హాజరయ్యారు.

# 'గోషామహల్‌లో బంగారం, వజ్రాలతో గణేశుడు'..



**గోషామహల్ గణేశుడిపై సోషల్ మీడియా ప్రచారం అవాస్తవం**
**పంచలోహ విగ్రహమంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన పోలీసులు**
**బంగారు తాపడం, వజ్రాల అలంకరణ ఉందన్నది అబద్ధమని వెల్లడి**
**వదంతులు నమ్మొద్దని, షేర్ చేయొద్దని ప్రజలకు పోలీసుల సూచన**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ప్రతిష్ఠించిన 'లాల్‌బాగ్‌చా రాజా గణేశ్-2026' విగ్రహంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఓ గణేశుడి విగ్రహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేశారని, 48 కిలోల బరువుతో పాటు 24 క్యారెట్ల బంగారు తాపడం చేశారని, అలాగే 3,83,800 కృత్రిమ వజ్రాలతో అలంకరించారని కొన్ని పోస్టులు వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సైతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.ఈ ప్రచారంపై గోషామహల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ స్పందించారు. సోషల్ మీడియాలో పేర్కొంటున్నట్లుగా ఈ విగ్రహాన్ని పంచలోహాలతోగానీ, బంగారంతోగానీ తయారు చేయలేదని ఆయన తేల్చిచెప్పారు. సదరు ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇటువంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు



**లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు**
**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ**
**కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు.

# కుటుంబంతో కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్

**ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు**
**శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, నారా బ్రహ్మణి**
**పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న చంద్రబాబు, లోకేశ్**
**2027 టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల తొలిరోజున రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం తెలిసిందే. ఈ పవిత్ర వేడుకలలో మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు.మంగళవారం సాయంత్రం తిరుమల చేరుకున్న మంత్రి లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు తొలుత బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకోగా, అధికారులు మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి భువనేశ్వరి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలను అందజేశారు.అనంతరం సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దర్శనానంతరం ఆలయం వెలుపల జరిగిన పెద్దశేష వాహనసేవలో పాల్గొని మలయప్ప స్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# నారా లోకేశ్ నాయకత్వ లక్షణాలను చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోంది



**కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 8 లక్షల ఉద్యోగాలు కల్పించిందన్న అనురాధ**
**లోకేశ్ నాయకత్వాన్ని చూసి గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ఆగ్రహం**
**జగన్ పాలనలో డీఎస్సీ నియామకాలు సున్నా అని విమర్శ**
**ఏపీపీఎస్సీలో రూ.150 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణ**


**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రంలో 8 లక్షల ఉద్యోగాలు కల్పించిందని, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ స్పష్టం చేశారు. లోకేశ్ నాయకత్వ పటిమను, పనితీరును చూసి ఓర్వలేకే 'గొడ్డలి పార్టీ' (వైసీపీ) ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు, ఎంఎస్ఎంఈ, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ, పర్యాటక రంగాల ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించామని అనురాధ వివరించారు. అయితే, లోకేశ్ ఇమేజ్‌ను దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని, ఆయన హయాంలో నిరుద్యోగితలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని విమర్శించారు. ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం దాదాపు 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ విధానాల వల్లే అదానీ గ్రూప్, లులూ గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, కియా అనుబంధ పరిశ్రమలు, అమర్‌రాజా బ్యాటరీస్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక కంపెనీలు రాష్ట్రం నుంచి తరలిపోయాయని అనురాధ ఆరోపించారు. యువతను గంజాయికి బానిసలుగా మార్చి, వారి భవిష్యత్తును నాశనం చేశారని అన్నారు. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిట్ విచారణలో రూ.150 కోట్ల స్కామ్ బయటపడిందని, ప్రభుత్వ స్ట్రాంగ్ రూమ్ నుంచి పేపర్లను ప్రైవేట్ రిసార్టులకు తరలించి అనర్హులతో మూల్యాంకనం చేయించారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తన 16 నెలల జైలు జీవితం, తండ్రి శవం పక్కన సంతకాల సేకరణ, 31 క్రిమినల్ కేసులు, వివేకా హత్య వంటి అంశాలపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె సవాల్ విసిరారు.ఈ నేపథ్యంలో, సెప్టెంబర్ 16 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'యువత భవితకు భరోసా' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అనురాధ ప్రకటించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు యూనివర్సిటీలు, కళాశాలలకు వెళ్లి ప్రభుత్వ ఉద్యోగ కల్పన కార్యక్రమాలను, మెగా డీఎస్సీ పారదర్శకతను వివరిస్తారని తెలిపారు. అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలను కూడా యువతకు తెలియజేస్తారని చెప్పారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న గొడ్డలి పార్టీ ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

# ఆళ్ల నాని హఠాన్మరణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన

**మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో కన్నుమూత**
**ఆయన మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి**
**56 ఏళ్లకే గుండెపోటుతో మరణించడం బాధాకరమన్న సీఎం**
**ఆళ్ల నాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన చంద్రబాబు**
**విశాఖలో గుండెపోటుతో కన్నుమూసిన ఆళ్ల నాని**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని (కాళీ కృష్ణ శ్రీనివాస్) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో ఆళ్ల నాని దూరమవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ మేరకు చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా తన సంతాప సందేశాన్ని పంచుకున్నారు. ఆళ్ల నాని గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని తన పోస్టులో పేర్కొన్నారు.కాగా, ఆళ్ల నాని ఇవాళ విశాఖపట్నంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మృతి వార్త తెలియగానే రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది. పలువురు రాజకీయ నాయకులు ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నారు. సౌమ్యుడు, వివాదరహితుడైన నేతగా ఆళ్ల నానికి గుర్తింపు ఉంది.

# ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు భారీ ఊరట.. 892 పోస్టుల భర్తీ.. గ్రూప్-1 సహా నోటిఫికేషన్ల విడుదల!




**గ్రూప్-1లో 163 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**
**11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ ఉద్యోగాల భర్తీ**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఉద్యోగార్థులకు బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని 20 విభిన్న ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మొత్తం 892 పోస్టుల భర్తీకి అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగానే కీలకమైన గ్రూప్-1 సర్వీసులలో 163 పోస్టులు సహా వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల అభ్యర్థులు నిబంధనలు పరిశీలించి అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**నోటిఫికేషన్ల ప్రకారం పోస్టుల వివరాలు:**

గ్రూప్-1 సర్వీసులు (163 పోస్టులు): 11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ (సివిల్), 3డీఎస్పీ (కమ్యూనికేషన్స్), 14 టాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్లు, 35 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఆణూ), 15 డిప్యూటీ రిజిస్ట్రార్లు, 12 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, 14 డిస్ట్రిక్ట్/డివిజనల్ ఫైర్ ఆఫీసర్లు, 14 అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ల పోస్టులతో పాటు ఇతర ఉన్నత పోస్టులు ఉన్నాయి.ఇతర ముఖ్య శాఖల్లో ఖాళీలు: అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు (196), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 (73), హార్టికల్చర్ ఆఫీసర్లు (37), పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఎనలిస్ట్ గ్రేడ్-2 (18), ఏపీ అసెంబ్లీ రిపోర్టర్లు (11), ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర పోస్టులు భర్తీ కానున్నాయి.

**దరఖాస్తు గడువు .. ముఖ్య సమాచారం:**

గ్రూప్-1 దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 6 నుండి ప్రారంభమై అక్టోబర్ 27 వరకు కొనసాగనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు నిబంధనలు, విద్యార్హతలు, వయోపరిమితికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆయా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకుని గడువులోగా అప్లై చేసుకోవచ్చని బోర్డు తెలిపింది.

# ఏపీ నిరుద్యోగులకు గుడ్ న్యూస్.. గరిష్ఠ వయోపరిమితి పెంపు

**ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాలకు పెరిగిన వయోపరిమితి**
**నాన్-యూనిఫాం పోస్టులకు 34 నుంచి 44 ఏళ్లకు పెంపు**
**2027 సెప్టెంబర్ 30 వరకు నోటిఫికేషన్లకు వర్తించనున్న సడలింపు**
**పోలీస్, ఫారెస్ట్ వంటి యూనిఫాం పోస్టులకు వర్తించని ఈ పెంపు**
**రిజర్వేషన్ కేటగిరీల వయోపరిమితి సడలింపులు యథాతథం**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వయోపరిమితి పెంపుపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాన్-యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యక్ష నియామకాలకు గరిష్ఠ వయోపరిమితిని 10 సంవత్సరాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లకు పెరిగింది. ఏపీపీఎస్సీతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు చేపట్టే నియామకాలకు ఈ పెంపు వర్తిస్తుంది.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఈ పదేళ్ల అదనపు వయోపరిమితి సడలింపు 2027 సెప్టెంబర్ 30వ తేదీ వరకు విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్లకు మాత్రమే అమల్లో ఉంటుంది. అంటే.. దాదాపు ఏడాది పాటు చేపట్టే నాన్-యూనిఫాం పోస్టుల భర్తీకి ఈ అవకాశం అందుబాటులో ఉండనుంది. అయితే, యూనిఫాం సర్వీసులకు మాత్రం సాధారణ కేటగిరీలో కేవలం రెండేళ్ల పాటు వయోపరిమితిని పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది.ఇప్పటికే 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996' ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి రిజర్వేషన్ కేటగిరీలకు ప్రస్తుతం అమలులో ఉన్న వయోపరిమితి సడలింపులు యథావిధిగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే.. పెంచిన 44 ఏళ్ల గరిష్ఠ పరిమితికి అదనంగా ఈ వర్గాలకు రిజర్వేషన్ల ప్రకారం మరో ఐదేళ్ల సడలింపు వర్తిస్తుంది.అయితే, ఈ వయోపరిమితి పెంపు అన్ని ఉద్యోగాలకు వర్తించదని ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. పోలీస్, ఎక్సైజ్, ఫైర్, జైళ్లు, అటవీ, రవాణా శాఖలకు చెందిన యూనిఫాం పోస్టులకు, నిర్దిష్ఠ భౌతిక ప్రమాణాలు తప్పనిసరి అయిన ఉద్యోగాలకు ఈ 10 ఏళ్ల సడలింపు వర్తించదు. అభ్యర్థులు ఆయా ఉద్యోగ ప్రకటనలలో పేర్కొన్న నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులు సూచించారు.గత కొంతకాలంగా ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో వయసు మీరుతోందని ఆందోళన చెందుతున్న నిరుద్యోగ యువత, వయోపరిమితిని పెంచాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు పలు సందర్భాల్లో విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, అధికారులతో చర్చించి ఈ సానుకూల నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో నిరుద్యోగ యువతలో హర్షం వ్యక్తమవుతోంది. తమ విన్నపాన్ని మన్నించినందుకు వారు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## 10వేల అడుగులు నిజం.. ఈ లెక్క ఎక్కడిది?
# చాలామందికి తెలియని ఆసక్తికర విషయం

మనం వ్యాయమం చేయాడినికి జిమ్ కు వెళ్లినా.. లేదా ఏదైనా హస్పిటల్ వెళ్లినా.. ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 10 వేల అడుగులు వేయాలని అని పోస్టర్లు తరచూ కనిపిస్తూ ఉంటాయి. దాదాపుగా చాలామంది వైద్యులు చెప్పే మాటా కూడా ఇదే. చేతి గడియారాలు, మొబైల్ యాప్‌లు కూడా చాలా వరకు అదే లక్ష్యాన్ని గుర్తు చేస్తుంటాయి. అందుకే చాలామంది రోజూ ఎన్ని అడుగులు నడిచామో చూసుకుంటూ ఉంటారు. కానీ అసలు ఈ 10 వేల అడుగులు అనే లెక్క ఎక్కడి నుంచి వచ్చింది? అనేది ఆసక్తికరమైన విషయం.



### జపాన్‌లో మొదలై..

రోజుకు 10 వేల అడుగులు వేయాలి అనే మాట మొట్టమొదటి సారి జపాన్‌లో ప్రాచుర్యంలోకి వచ్చింది. 1960 సమయంలో జపాన్‌లో అడుగులు లెక్కించే ఒక చిన్న పరికరం మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. దానికి 'మాన్పో-కే' అనే పేరు పెట్టారు. జపనీస్ భాషలో "మాన్" అంటే 10 వేలు, "పో" అంటే అడుగులు, "కే" అంటే కొలిచే పరికరం. అంటే దాని అర్థం 10 వేల అడుగులు లెక్కించే పరికరం అన్నమాట.ఆ సమయంలో ప్రజలను ఎక్కువగా నడవడానికి ప్రోత్సహించేందుకు ఈ పేరు పెట్టారు. పేరు సులభంగా గుర్తుండేలా ఉండటంతో, "రోజుకు 10 వేల అడుగులు" అనే మాట జనాల్లో బాగా పాపులర్ అయింది.

### ఇది మొదట వైద్యుల లెక్క కాదు

చాలామంది అనుకునేలా 10 వేల అడుగులు అనేది మొదట వైద్య పరిశోధన నుంచి వచ్చిన సంఖ్య కాదు. ఇది మొదటగా ఒక అడుగులు లెక్కించే పరికరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగించిన ఆకర్షణీయమైన లక్ష్యం. తర్వాత కాలంలో ఆరోగ్య ప్రచారాలు, చేతి గడియారాలు, మొబైల్ యాప్‌లు ఈ సంఖ్యను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. అంటే 10 వేల అడుగులు అనే సంఖ్య మొదట అమ్మకాలకు అనుకూలమైన మాటగా పుట్టింది. కానీ ఆ తర్వాత అది మంచి ఆరోగ్య అలవాటుగా మారింది. ఎందుకంటే రోజంతా కూర్చునే జీవనశైలితో పోలిస్తే, 10 వేల అడుగులు నడవడం శరీర కదలికను చాలా పెంచుతుంది.

### అయితే 10 వేల అడుగులు మంచివేనా?

అవును... రోజూ నడక ఆరోగ్యానికి చాలా మంచిది. 10 వేల అడుగులు వేయడం వల్ల శరీరం చురుకుగా ఉంటుంది. గుండె ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. బరువు నియంత్రణకు సహాయపడుతుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. నిద్ర కూడా బాగా పడుతుంది.కానీ 10 వేల అడుగులే అందరికీ తప్పనిసరి అని అనుకోవాల్సిన అవసరం లేదు. నడక అలవాటు లేని వ్యక్తి ఒక్కసారిగా 10 వేల అడుగులు వేయడం కష్టం. కొందరికి మోకాళ్ల నొప్పి, కాళ్ల నొప్పి రావచ్చు. అందుకే శరీర సామర్థ్యాన్ని బట్టి లక్ష్యం పెట్టుకోవాలి.

### అందరికీ ఒకే లెక్క సరిపోదు...

ఒక యువకుడికి 10 వేల అడుగులు సాధారణ లక్ష్యం కావచ్చు. కానీ వయసు ఎక్కువగా ఉన్నవారికి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి, కార్యాలయంలో ఎక్కువసేపు కూర్చునే వారికి మొదట 4 వేల నుంచి 6 వేల అడుగులు కూడా మంచి ప్రారంభం కావచ్చు.ఇప్పటివరకు వ్యాయామం అలవాటు లేని వారు మొదట తక్కువ అడుగులతో మొదలుపెట్టి, క్రమంగా పెంచుకోవడం మంచిది. రోజుకు 3 వేల అడుగులు వేసేవారు ఒక్కసారిగా 10 వేల అడుగులు కాకుండా, ముందుగా 5 వేల, తర్వాత 7 వేల, ఆ తర్వాత 10 వేలలా పెంచుకుంటే శరీరం అలవాటు పడుతుంది.

### బరువు తగ్గడానికి 10 వేల అడుగులు సరిపోతాయా?

నడక బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కానీ ఆహారం అదుపులో లేకపోతే 10 వేల అడుగులు వేసినా ఫలితం తక్కువే. ఉదయం నడిచి వచ్చి ఎక్కువ కేలరీలు ఉన్న ఆహారం తింటే బరువు తగ్గడం కష్టం.అందుకే బరువు తగ్గాలంటే నడకతో పాటు ఆహార నియంత్రణ కూడా అవసరం. వేయించిన పదార్థాలు, తీపి పదార్థాలు, ఎక్కువ నూనె ఉన్న ఆహారం తగ్గించడం మంచిది. తగినంత నీళ్లు తాగడం, రాత్రి తేలికగా భోజనం చేయడం, సరైన నిద్ర కూడా ముఖ్యం.

### లెక్క చూసి టెన్షన్ పడొద్దు...

చాలామంది చేతి గడియారంలో 10 వేల అడుగులు పూర్తికాలేదంటే ఆందోళన చెందుతుంటారు. కానీ ఆరోగ్యానికి కదలిక ముఖ్యం, సంఖ్య మాత్రమే కాదు. కొందరు రోజూ 7 వేల అడుగులు వేసినా, ఆహారం బాగుంటే, నిద్ర సరిగా ఉంటే, ఒత్తిడి తక్కువైతే ఆరోగ్యం మెరుగ్గా ఉండొచ్చు. అలాగే కొందరు 10 వేల అడుగులు వేసినా, రోజంతా సరైన ఆహారం తీసుకోకపోతే, నిద్ర సరిగా లేకపోతే ఆశించిన ఫలితం కనిపించకపోవచ్చు.

### చివరిగా.. అసలు నిజం ఇదే

రోజుకు 10 వేల అడుగులు అనే లక్ష్యం మొదట శాస్త్ర పరిశోధనలో పుట్టిన సంఖ్య కాదు. జపాన్‌లో అడుగులు లెక్కించే పరికరానికి పెట్టిన పేరుతో ఈ మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే ఆ మాట వల్ల ప్రజలు ఎక్కువగా నడవడం మొదలుపెట్టారు. అందుకే అది మంచి ఆరోగ్య అలవాటుగా మారింది.కాబట్టి 10 వేల అడుగులు మంచిదే. కానీ అదే అందరికీ తప్పనిసరి లెక్క కాదు. మీ శరీరానికి సరిపోయేంత నడవండి. క్రమంగా అడుగులు పెంచుకోండి. ప్రతిరోజూ కదలడం అలవాటు చేసుకోండి. అదే అసలైన ఆరోగ్య రహస్యం.

# వర్షాకాలం.. 10 ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి.. లేదంటే ముప్పే!



ఎండాకాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాలతో వాతావరణం చల్లబడుతుంది. అయితే అదే సమయంలో జలుబు, జ్వరం, గొంతు నొప్పి వంటి సీజనల్ అనారోగ్య సమస్యలు కూడా పెరుగుతాయి. ఇవి సాధారణ సమస్యలే కదా అని నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటం, వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### బయట ఆహారానికి నో చెప్పండి..

వర్షాకాలంలో బయట లభించే బజ్జీలు, టీ వంటి ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా అనిపిస్తాయి. అయితే వీటిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా బయట కట్ చేసి విక్రయించే పండ్లు లేదా మూతలేకుండా ఉంచిన ఆహారం తీసుకోవడం ప్రమాదకరం. వీలైనంత వరకు గోరువెచ్చని నీరు తాగడం, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

### దోమలతో జర జాగ్రత్త..

వర్షాకాలం దోమల పెరుగుదలకు అనుకూలమైన సమయం. ఎక్కడ చూసినా నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఇంటి పరిసరాల్లోని గుంటలు, బకెట్లు, ట్యాంకులు వంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది. అందుకే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అత్యంత అవసరం.

### ఈ ఫుడ్స్ బెస్ట్..

వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవడం అవసరం. వేడి సూప్‌లు, పప్పులు, ఆకుకూరలు, తాజా పండ్లు, తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది. అధిక నూనె, ఎక్కువ మసాలా, చల్లని పదార్థాలను తగ్గిస్తే శరీరం సీజనల్ ఇన్‌ఫెక్షన్లను సమర్థంగా ఎదుర్కోగలదు.

### నిర్లక్ష్యం వద్దు..

జ్వరం, దగ్గు, గొంతునొప్పి, విరేచనాలు వంటి సమస్యలు రెండు రోజులకంటే ఎక్కువ కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు. ఇంట్లోనే మందులు వాడుతూ ఆలస్యం చేయడం కంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం సురక్షితం. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవాలి.మొత్తానికి వర్షాకాలాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. పరిశుభ్రమైన నీరు తాగడం, వేడి ఆహారం తీసుకోవడం, దోమల నియంత్రణ చేపట్టడం, తడి బట్టలను ఎక్కువసేపు ధరించకుండా ఉండటం వంటి అలవాట్లు పాటిస్తే ఈ సీజన్‌ను ఆరోగ్యంగా ఆస్వాదించవచ్చు.

# పద్మాసనంలో ఎక్కువసేపు కూర్చోవడం మంచిదేనా?



కూర్చోవడం, పని చేయడం దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా మారింది. సౌకర్యం కోసం, ప్రజలు తరచుగా పద్మాసనంలో( కాళ్లు ముడుచుకుని) కూర్చోవడానికి ఇష్టపడతారు. అయితే, పద్మాసనంలో కూర్చునే భంగిమ శరీరంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతుందని కొందరు అంటారు. ఇది ఎంత వరకు నిజమో ఇప్పుడు తెలుసుకుందాం..ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఒకే భంగిమలో ఎక్కువసేపు కూర్చోవడం మంచిది కాదు. ఎక్కువసేపు పద్మాసనంలో కూర్చుంటే కాళ్లలో తిమ్మిరి, జలదరింపు రావచ్చు. నరాలపై ఒత్తిడి పడుతుంది. కొంచెం నొప్పి లేదా బిగుతుగా అనిపించవచ్చు. మన వెన్నెముక బలంగా ఉండి, భిన్నమైన భంగిమలకు సరిపోతుంది. కానీ, ఎక్కువసేపు కదలకుండా ఉంటే మాత్రం వెన్ను నొప్పి, మోకాలి నొప్పి రావచ్చు. కొద్దిసేపు పద్మాసనంలో కూర్చోవడం వల్ల ఏ మాత్రం హాని ఉండదు. కానీ ఇప్పటికే మోకాళ్ల నొప్పి లేదా సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.పద్మాసనం కొద్దిసేపు వేయడం వల్ల కూడా ఏకాగ్రత పెరగడమే కాకుండా, శారీరక, మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తొడలు, మోకాళ్లకు బలాన్ని ఇస్తుంది, ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను కలిగిస్తుంది. కానీ ఒకే భంగిమలో ఎక్కువసేపు కూర్చోవడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. మధ్య మధ్యలో లేచి కదలాలని.. శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచాలని చెబుతున్నారు.

# బరువు తగ్గేందుకు కొత్తగా ట్రెండ్ అవుతున్న 9-1 హెల్త్ రూల్.. ఏంటిది.. ఏం చేయాలి..?

బరువు తగ్గేందుకు కొత్త కొత్త డైట్‌లు, ఫిట్‌నెస్ చాలెంజ్‌లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందుతున్న ఈ రోజుల్లో, సులభంగా పాటించగలిగే ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. అలాంటి విధానాల్లో ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతున్నది 9-1 హెల్త్ రూల్. కఠినమైన ఆహార నియమాలు లేదా ఆకలి మానేసే డైట్‌లకు బదులుగా, ప్రతిరోజూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవడంపై ఈ పద్ధతి దృష్టి పెడుతుంది. 9-1 హెల్త్ రూల్‌లో రోజంతా పాటించాల్సిన తొమ్మిది ఆరోగ్యకరమైన అలవాట్లు ఉంటాయి. ఇవి పోషకాహారం, శారీరక చలనం, నీటి వినియోగం, నిద్ర, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను సమతుల్యంగా మెరుగుపరచడంలో సహాయపడతాయి. కేవలం కేలరీలు లెక్కించడం కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని స్థిరంగా కొనసాగించడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

### 9 గంటల పాటు శరీరం చురుగ్గా ఉండాలి..

ఈ నియమం ప్రకారం రోజుకు 9 గంటల పాటు శరీరం చురుకుగా ఉండేలా చూసుకోవాలి. దీని అర్థం 9 గంటలపాటు వ్యాయామం చేయడం కాదు. ఎక్కువసేపు ఒకేచోట కూర్చోకుండా నడవడం, నిలబడటం, ఇంటి పనులు చేయడం, మధ్య మధ్యలో స్ట్రెచింగ్ చేయడం వంటి చిన్న చిన్న కదలికలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలి. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి. తగినంత నీరు శరీర జీవక్రియలను మెరుగుపరచడంతోపాటు జీర్ణక్రియ, శక్తి స్థాయిలు, ఆకలి నియంత్రణకు కూడా సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో కనీసం ఏడు సర్వింగ్స్ పండ్లు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. ఇవి ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందించడంతోపాటు ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తాయి.



# జీలకర్ర, సెలెరీ, మెంతి నీరు.. ఉదయం ఖాళీ కడుపుతో తాగడానికి ఏది ఎక్కువ మంచిది?

ఈ రోజుల్లో జీలకర్ర నీరు, సెలెరీ నీరు, మెంతి నీరు వంటి ఇంటి చిట్కాలతో ఉదయం ప్రారంభించడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇవి బరువు తగ్గించడంలో, శరీరాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడతాయని సోషల్ మీడియాలో చెబుతున్నారు. అయితే ఆయుర్వేద నిపుణుల ప్రకారం ఇవి అందరికీ ఒకేలా పనిచేయవు. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వాటి ప్రభావం మారుతుంది. అందుకే ఎవరికి ఏ పానీయం మంచిదో తెలుసుకోవడం అవసరం.



### జీలకర్ర నీరు

జీలకర్ర నీరు జీర్ణక్రియకు చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇది కడుపులో జీర్ణ ఎంజైమ్‌లు, పైత్యరసం విడుదలను పెంచి ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. భోజనం తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా బరువుగా అనిపించే సమస్యలు ఉన్నవారికి ఇది ఉపయోగకరం. ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచి ఫలితం ఉంటుంది. తయారు చేయడానికి ఒక టీస్పూన్ జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం వడకట్టి తాగాలి.

### సెలెరీ నీరు

సెలెరీలో థైమోల్ అనే పదార్థం ఉంటుంది. ఇది కడుపు నొప్పి, తిమ్మిర్లు, అజీర్ణం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఇది చాలా ఘాటుగా ఉండే కారణంగా జాగ్రత్త అవసరం. యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట లేదా దీర్ఘకాలిక గ్యాస్ట్రిటిస్ ఉన్నవారు దీన్ని రోజూ తీసుకోకూడదు. ఎందుకంటే ఇది ఆమ్లత్వాన్ని పెంచవచ్చు. గర్భిణీలు సెలెరీ నీరు పూర్తిగా మానుకోవడం మంచిది, ఎందుకంటే ఇది గర్భాశయ సంకోచాలను ప్రేరేపించవచ్చు. దీనిని అప్పుడప్పుడు మాత్రమే ఔషధంగా ఉపయోగించాలి.

### మెంతి నీరు


మెంతి నీరు జీవక్రియను మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. మెంతుల్లో ఉండే కరిగే పీచు పదార్థం ఆహారం జీర్ణం అవడాన్ని నెమ్మదింపజేస్తుంది. ఇది ప్రీడయాబెటిస్, టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి చాలా ఉపయోగకరం. అలాగే దీర్ఘకాలిక మలబద్ధకం ఉన్నవారికి కూడా సహాయపడుతుంది. అయితే మెంతుల నీరు కొంచెం చేదుగా ఉంటుంది. ఎక్కువగా తీసుకుంటే విరేచనాలు కావచ్చు. డయాబెటిస్ మందులు తీసుకునే వారు వైద్యులను సంప్రదించిన తర్వాత మాత్రమే మెంతుల నీరు తాగడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.మీ ప్రధాన లక్ష్యం బరువు తగ్గడం అయితే జీలకర్ర నీటిని ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అధిక ఆకలి లేదా షుగర్ లెవల్స్ నియంత్రణ కోసం మెంతుల నీరు తాగవచ్చు. మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఈ మూడు పానీయాల్లో మీకు సరిపోయేదాన్ని ఎంచుకోవడం ఉత్తమం.

# తెలుగులో మరో బంపరాఫర్

అగ్ర కథానాయిక శ్రీలీలకు వరుసగా అవకాశాలైతే వస్తున్నాయి కానీ..విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడిందివశిష్ట దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో లాంచ్ కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి పలువురు యువ నాయికల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు శ్రీలీలను ఓకే చేశారని అంటున్నారు. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్ 'ఓం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అలాగే హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ చిత్రంలో నటించనుంది.



## తమ మధ్య రొమాంటిక్ రిలేషన్ లేదన్న వైష్ణవి



టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్యలు రిలేషన్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబి'తో పాటు 'ఎపిక్'లో కలిసి నటించిన ఈ జోడీ రీల్ లైఫ్ కెమిస్ట్రీ చూసి, వీరిద్దరూ రియల్ లైఫ్ లోనూ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ డేటింగ్ రూమర్లపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన వైష్ణవి చైతన్య, తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని తేల్చి చెప్పింది. తామిద్దరం మంచి కో-స్టార్స్ మాత్రమే కాకుండా ఆత్మీయ స్నేహితులమని తెలిపింది.

## 'కింగ్' సినిమా అలస్యమవడం లేదు



బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ తన రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్' ప్రాజెక్ట్ ఆలస్యమవుతోందంటూ వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో సుజయ్ ఘోష్ రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రణాళిక ప్రకారమే శరవేగంగా సాగుతోందని క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలీవుడ్ మ్యాజికల్ సింగర్ అరిజిత్ సింగ్‌తో ఉన్న కాంబినేషన్‌పై ఖాన్ సంచలన అప్‌డేట్ అందించారు.'కింగ్' చిత్రం రీ-షెడ్యూల్ అయిందనే వార్తలలో ఎలాంటి నిజం లేదని, ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే లండన్, ఐరోపాలోని పలు ప్రాంతాల్లో భారీ యాక్షన్ సీన్లను చిత్రీకరిస్తున్నామని షారుఖ్ తెలిపారు. 'దిల్వాలే' (జెరువా), 'పఠాన్' (జూమే జో పఠాన్), 'జవాన్' (చాలేయా) వంటి చారిత్రాత్మక చార్ట్‌బస్టర్ల తర్వాత అరిజిత్ తో మళ్లీ ఓ అద్భుతమైన లవ్ ట్రాక్ కోసం చేతులు కలిపామని వెల్లడించారు.


## 'రంగస్థలం' సెట్‌లో రామ్ చరణ్ గిఫ్ట్..



'దసరా' చిత్రంతో దర్శకుడిగా బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న శ్రీకాంత్ ఓదెల, తన కెరీర్ తొలినాళ్లలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో ఉన్న ఒక మధురమైన జ్ఞాపకాన్ని పంచుకున్నారు. 'రంగస్థలం' సినిమా షూటింగ్ సమయంలో రామ్ చరణ్ తనకు ఇచ్చిన ఒక ప్రత్యేకమైన బహుమతి గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆ బహుమతిని ఇప్పటికీ తన మెడలోనే ధరిస్తున్నట్లు ఆయన తెలిపారు.దర్శకుడు సుకుమార్ రూపొందించిన 'రంగస్థలం' (2018) చిత్రానికి శ్రీకాంత్ ఓదెల సహాయ దర్శకుడిగా పనిచేశారు. ప్రస్తుతం నాని హీరోగా ఆయన దర్శకత్వంలో వస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా ప్రమోషన్లలో భాగంగా, శ్రీకాంత్ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "రంగస్థలం షూటింగ్ సమయంలో నేను చరణ్ గారిని చాలా ఇబ్బంది పెట్టేవాడిని. కాస్ట్యూమ్స్ విషయంలో, తెల్లవారుజామున 3:30 గంటలకే నిద్రలేపి షూటింగ్‌కు సిద్ధం కమ్మని చెప్పేవాడిని.


## ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ ఖరారు



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. 'ఎం.ఎస్. - ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది.'జెర్సీ' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం.

## డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ పాత్ర ఇదే..



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది.'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి.మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.